# కథ

గవర ఈశ్వరరావు

"సార్...మీకే ఫోన్"

ఇంపార్టెంట్ ఫైల్లో తలమునకలై వున్న నేను..ప్యూన్ మాట విని సీట్లోంచి లేచి..ఫోన్ వైపు కదిలాను.

వాడి చేతిలో నుంచి రిసీవర్ని అందుకుని "హలో!" అన్నాను.

# అగాధం

"హలో అంకుల్! నేను రాజాని!"

"ఏ రాజా?" అడిగాను.

"వరహాలరావుగారి అబ్బాయిని"

"హలో రాజా! నువ్వా! ఎలా వున్నావ్? అమ్మా నాన్నలు ఎలా వున్నారు? అసలింతకీ ఎక్కడ్నుంచి మాట్లాడుతున్నావు?"

"నర్సీపట్నం నుంచి మాట్లాడుతున్నాను" అట్నుంచి రాజా సమాధానం.

"ఏమిటి విషయం?" మళ్ళీ అడిగాను.

"నాన్నగారి ఆరోగ్యం బాగులేదంకుల్! ఇక్కడ గవర్నమెంటు హాస్పిటల్లో జాయిన్ చేసాం. పరిస్థితి చాలా క్రిటికల్గా వుందని, విశాఖపట్నం కె.జి.హెచ్కు గాని లేదా ఏదైనా కార్పొరేట్ హాస్పిటల్కుగాని తీసుకెళ్ళిపొమ్మన్నారు."

నేనేమీ మాట్లాడలేదు.

"మీరు వైజాగ్లో వున్నారని తెలిసి ఫోన్ చేసాను. అక్కడ జాయిన్ చేస్తే మీరు కూడా కొద్దిగా సహాయంగా వుంటారని మాకెవరూ పెద్ద బంధువులు లేరన్న విషయం మీకు తెలును. ఈ లోపల నాన్నగారు ఒకసారి మిమ్మల్ని ఇక్కడికి రమ్మన్నారు" అంటూ అట్నుంచి రాజా అడ్రస్ చెప్పాడు.

రాజా చెప్పిన అడ్రస్ నోట్ చేసుకుని "అలాగే" అని చెప్పి ఫోన్ పెట్టేసాను.

అన్యమనస్కంగా వచ్చి సీట్లో కూర్చున్నాను.

తనూ, వరహాలరావు ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్నారు. వరహాలరావుకి ఒకే ఒక్క బాబు! తనకి ఒక పాప..బాబు. అయితే వరహాలరావు తాగుడికి బానిస! అందువలన ఆయన జీతమంతా..ఆ వ్యసనానికే ఖర్చు పెట్టేవాడు.

దానివలన అప్పులపాలయ్యాడు కూడా! ప్రతిరోజూ ఎవరో ఒకరు అతని కోసం ఇంటికి...ఆఫీసుకీ వస్తూ పోతుండేవారు. ఆఫీసులో అయితే వాళ్ళు పెద్ద పెద్ద కేకలు కూడా వేసేవారు. ఇదంతా మిగతావాళ్ళకి చాలా ఇబ్బందికరంగా వుండేది. ఈ న్యూసెన్స్ని భరించలేక రెండుమూడుసార్లు మా ఏ.ఇ.గారు వార్నింగ్ కూడా ఇచ్చారు.

తన దగ్గర కూడా వరహాలరావు ముప్పై వేల వరకూ తీసుకున్నాడు. తను కూడా బ్యాంకు వడ్డీకే అప్పిచ్చాడు. కొన్నాళ్ళు క్రమం తప్పకుండా వడ్డీ చెల్లించాడు. అయితే ఆ తర్వాత...వడ్డీని కూడా ఇవ్వటం మానేసాడు.

ఈ గొడవలకి తట్టుకోలేక..ఆ తర్వాత వరహాలరావు పై ఆఫీసర్లని పట్టుకుని..హైదరాబాదుకి రిక్వెస్ట్ ట్రాన్స్ఫర్ చేయించుకుని వెళ్ళిపోయాడు.

సుమారుగా పదిహేను సంవత్సరాలు తనూ..వాడూ పక్క పక్క ఇళ్ళలోనే అద్దెకు వుండేవారు. తనకి తెలిసి వాడికి దూరపు బంధువులుగాని..దగ్గరి బంధువులుగాని ఎవరూ లేరు. కష్టమైనా..సుఖమైనా తనతోనే చెప్పుకునేవాడు!

అప్పుడప్పుడు 'చనిపోతే బాగుంటుందేమో'నని అంటూండేవాడు. అలా అయితే భార్యకి పెన్షన్తోపాటు ఉద్యోగం కూడా వస్తుందని- అదిగాక పి.ఎఫ్.గ్రాట్యుటీ, ఇన్సూరెన్స్లాంటివన్నీ కలిపి సుమారుగా ఒక అయిదు లక్షల వరకూ వస్తుందని చెప్తుండేవాడు. అలాంటప్పుడు మాత్రం తనే చాలా గట్టిగా మందలించేవాడు. అలాంటి ఆలోచనల్ని మరోసారి మస్తిష్కంలోనికి రానివ్వవద్దని హెచ్చరించేవాడిని!

అయితే వరహాలరావు హైదరాబాద్ వెళ్ళే ముందర తనని కలిసి "ఎవరి అప్పులను తీర్చకపోయినా..నీ అప్పు మాత్రం అణా పైసలతో సహా తీరుస్తానురా! ప్రస్తుతానికి క్షమించు!" అంటూ కళ్ళ నీళ్ళ పర్యంతమయ్యాడు.

సరిగ్గా ఇప్పటికి ఏడు సంవత్సరాలైంది వాడు ట్రాన్స్ఫరై .అప్పుడు అలా హైదరాబాద్ వెళ్ళిన వ్యక్తి..ఇప్పుడిలా కొడుకుతో నర్సీపట్నం నుంచి ఫోన్ చేయించాడు.

ప్రస్తుతం మా పిల్లలిద్దరూ ఇంజనీరింగ్ చేస్తున్నారు. వాళ్ళ కెరీర్ను దృష్టిలో పెట్టుకునే నేను ఏ ప్రమోషన్కి వెళ్ళలేదు. నేను ఇంకా ఇక్కడే వుండి వుంటానని...తెలిసే బహుశా వాడు వాళ్ళబ్బాయితో నాకు ఫోన్ చేయించి వుంటాడు.

నిజంగానే వాడికి అంత సీరియస్గా వుందా?

లేదా మళ్ళీ ఏమన్నా డబ్బులు అవసరమై నాకు ఫోన్ చేయించాడా? ఇప్పటికీ వాడి ఖాతాలో నా సొమ్ము వడ్డీతో కలిపి సుమారుగా ఏభై వేలు దాటి వుంటుంది!

ఒకవేళ వరహాలరావు ఇక్కడ వైజాగ్లో ఏదన్నా హాస్పిటల్లో జాయిన్ అయితే..డబ్బు సహాయమే కాకుండా..టిఫిన్లు, భోజనాలు లాంటివి కూడా హాస్పిటల్కి పంపిస్తూ వుండాలి!

ఇదంతా మా ఆవిడికి చెప్పాను.

"సర్లెండి పాత బాకీకే దిక్కూ మొక్కూ లేదు! ఇంకా టిఫిన్లూ..భోజనాలు కూడానూ.." అంటూ ఎద్దేవా చేసింది.

మళ్ళీ తిరిగి రెండు రోజులకు రాజా దగ్గర్నుంచి ఫోన్ వచ్చింది.

"అంకుల్! నాన్నగారు మిమ్మల్ని ఎలాగైనా రమ్మంటున్నారు"

"సారీ బాబూ! సెలవు దొరకలేదు. మరొక్కసారి మా ఆఫీసర్గార్ని రిక్వెస్ట్ చేసి చూస్తాను- సరేనా?"

"అంకుల్ మీ ఇంటికి ఫోన్ వుందా?"

"లేదు?" అబద్ధం చెప్పాను.

ఆ తర్వాత మా ప్యూన్ని పిలిచి "రాజా అనే అబ్బాయి నుంచి ఎప్పుడన్నా నాకు ఫోన్ వస్తే, తను లేడని..వారం రోజులు సెలవులో వెళ్లాన"ని చెప్పమన్నాను.

ఆ నెలలో మరో నాలుగుసార్లు రాజా నుంచి ఫోన్ కాల్స్ వచ్చాయి.

ప్యూన్ నేను చెప్పినట్లుగానే అబద్ధం చెప్పాడు.

అయితే..ఆ తర్వాత అనుకోకుండా ఆఫీసులో ప్యూను లేనప్పుడు వచ్చిన ఒక ఫోన్ కాల్ని నేను రిసీవ్ చేసుకున్నాను.

అది రాజా దగ్గర్నుంచి వచ్చిన 'కాల్'!

"హలో" అన్న నా గొంతుని రాజా పోల్చేసాడు.

"హలో అంకుల్ నేను రాజాని..డాడీ చనిపోయారు!" అన్న వార్తని చెవిలో వేసాడు.

ఒక్కక్షణం అలా శిలాప్రతిమలా వుండిపోయాను.

ఏం మాట్లాడాలో తెలీక నోరు పెగల్లేదు.

"....ఆ తర్వాత రెండు మూడుసార్లు మీకు ఫోన్ చేసాను. మీరు సెలవులో వున్నారని తెలిసింది" రాజా చెప్పాడు.

"సరే..నేనూ ఆంటీ కలిసి మీ ఇంటికొస్తాం" ఫోన్ పెట్టేసాను.

ఇంతకు ముందు రాజా చెప్పిన అడ్రస్ ప్రకారం నేనూ..నా భార్యా ఆ మరుసటి రోజే నర్సీపట్నం వరహాలరావు ఇంటికి వెళ్ళాం.

మమ్మల్ని చూడగానే వరహాలరావు భార్య భోరుమని ఏడ్చేసింది.

ఒకటి కాదు..రెండు కాదు సుమారుగా పదిహేను సంవత్సరాలు ఇరుగుపొరుగున వుండేవాళ్ళం!

రాజా కూడా గుండె నిండా విషాదం నింపుకుని...నీళ్ళు నిండిన కళ్ళతో మమ్మల్ని చూస్తున్నాడు.

ఆ తర్వాత పరామర్శలన్నీ అయిపోయాయి.

నా పక్కనే కూర్చున్న నా భార్య అప్పు విషయం కదపమని నా కాలు మీద చేత్తో గోకుతుంది.

అయితే...అప్పు విషయం 'ఆ' సమయంలో మాట్లాడితే బాగుండదని..మరోసారి వచ్చినప్పుడు ఆ విషయం కదలిస్తే బాగుంటుందని కళ్ళతోనే ఆమెకు తెలియజేసాను.

"మరోసారి మళ్ళీ వస్తాం..రాజా!" అంటూ లేవబోయాను.

"అంకుల్..ఒక్క క్షణం! కూర్చోండి" అంటూ రాజా గబగబా ఇంట్లోకి వెళ్ళి ఒక కవరు తెచ్చి నా చేతిలో పెట్టాడు.

కవరు చింపి చూసాను..అందులో ఒక వుత్తరం ఉంది.

బయటకు తీసి చదవటం ప్రారంభించాను.

"ఒరేయ్ ఈశ్వర్!

నా ఆరోగ్యం బాగులేకపోవటం వలనే రాజాతో చెప్పి నేనే ఫోన్ చేయించాను. తాగుడు వలనే నా ఆరోగ్యం పాడయిందనే విషయం నీకు తెలుసు! ఇక చివరి దశలోనికి వచ్చేసాను. అందుకే అబ్బాయి వైజాగ్‌లో కార్పొరేట్ హాస్పిటల్‌లో జాయిన్ చేస్తానన్నా..నేనే వాడిని వారించాను. ఆర్నెలల క్రితమే వాడికి చెన్నైలోని టి.సి.ఎస్.లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం ప్రొబేషన్‌లో వున్నాడు. నెలకి పదహారు వేల రూపాయలు జీతం! కన్ఫర్మ్ అయితే సుమారుగా పాతిక వేల వరకూ జీతం వస్తుంది.

నీ రాక కోసమే వారం రోజులు ఎదురు చూసాను. నువ్వు రాలేదు! ఒరేయ్! నా మీద నీకు కోపం వచ్చిందా?

నేను చేసిన అప్పులన్నింటిని తీర్చేసాను. ఇక మిగిలింది నీదే! ఇదే కవరులో నీ దగ్గర తీసుకున్న అసలు ముప్పై వేల రూపాయలకి ఒక డి.డి. వుంటుంది చూడు! వడ్డీని అబ్బాయి తీర్చేస్తాడు.

...ఒరేయ్..ఇంకో విషయం..."

అప్పటికే కళ్ళనిండా నీళ్ళు చిప్పిల్లి...అక్షరాలన్నీ మసకబారినట్టుగా వున్నాయి.

మనిషికి-మనిషికీ మధ్య ఆర్థిక వ్యవహారాల వలన వచ్చిన చిక్కే ఇది!

అసలు వరహాలరావు ఎప్పటి స్నేహితుడు? ఎలాంటి స్నేహితుడు? అలాంటి స్నేహితుడి కడసారి చూపునకు కూడా నోచుకోలేకపోయాను.

వాడి ఆరోగ్య స్థితి బాగులేదని తెలిసి..మళ్ళీ ఎక్కడ చెయ్యి చాస్తాడోనని భయపడి...అబద్ధాలాడి తప్పించుకున్నాడు తను.

వాడికి బాగులేదని తెలిసిన వెంటనే వెళ్ళి వుంటే ఎంత బావుండేది? వాడి కళ్ళల్లో నన్ను చూసిన ఆనందం..ఆ మెరుపు నేను చూసి వుంటే నాకు ఎంత మనశ్శాంతి కలిగేది? చాన్నాళ్ళ తర్వాత కలిసినందుకు వాడు ఎంతలా సంతోషంతో ఉప్పొంగిపోయేవాడో?



సమాధానం దొరకని ప్రశ్నలు!

ఒకవేళ డబ్బులే అప్పుగా అడిగి వుంటే..తను 'లేవు' అని సమాధానం చెప్తే..వాడేమీ తనని తప్పు పట్టడుగా?

ఇప్పుడు ఎంత బాధపడితే మాత్రం..ఫలితం ఏమిటి?

జరగరాని ఘోరం జరిగిపోయింది.

ఛ..ఛ..తను ఎంత తెలివి తక్కువగా ప్రవర్తించాడు.

వరహాలరావు కుటుంబానికి తన నిజస్వరూపం తెలిస్తే వాళ్ళు ఎంత అసహ్యించుకుంటారు!

కళ్ళు తుడుచుకున్నాను.

"...నీకు తెలుసు నాకు బంధువులెవరూ లేరని! ఉన్న ఆత్మీయుడువి నువ్వొక్కడివే! నేను బ్రతికి వుండగా నీ అప్పును తీర్చలేకపోయాను. కానీ నాకొక కోరిక వుంది. తీరుస్తావు కదూ!? అదే..మా అబ్బాయికి-మీ అమ్మాయినిచ్చి పెళ్ళి చేస్తావు కదా? ఇదే నా చివరి కోరిక..!"

నా గుండె అగ్నిపర్వతంలా విస్ఫోటనం చెంది..కన్నీళ్ళు లావాలా కళ్ళల్లో నుంచి బయటకొస్తున్నాయ్!

అందరిలాగానే తను కూడా మనిషికీ మనిషికీ మధ్యన వుండే బంధాలన్నింటిని వ్యాపార బంధాలుగానే అపోహ పడ్డాడు. కానీ..అంతకు మించి అప్యాయతానురాగాలు..మమతలూ..మానవత్వాలు వుంటాయని ఊహించలేకపోయాను.

వాడికీ..తనకీ మధ్యన ఇప్పుడు ఎంత 'అగాధం' ఏర్పడింది..అదీ ఎవరూ భర్తీ చెయ్యలేని అగాధం!

'దోషి'లా తల వంచుకున్నాను.